
కృష్ణా.. ముకుందా.. మురారి





చిన్నారులకు శ్రీకృష్ణుని గోపికల వేషధారణ



విశేష అలంకారంలో శ్రీ మురళీకృష్ణుడు



హారతులు అందుకుంటున్న భక్తులు



స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కడప సెవెన్‌రోడ్స్ : శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం కడప నగరంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామిని విశేష అలంకారంలో దర్శించుకునేందుకు బారులు తీరారు. నిర్వాహకులు వారికి సులభంగా దర్శనం అయ్యేందుకు బారికేడ్లు, పందిళ్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆయా ఆలయాల వద్ద నిర్వాహకుల ఆధ్వర్యంలో చిన్నారులు శ్రీకృష్ణుని బాల్యం, మహిమల గురించిన నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఆలయాల సమీపంలో యువత ఉట్టికొట్టే కార్యక్రమాల్లో ఉత్సాహ భరితంగా పాల్గొన్నారు. రాత్రి ఆయా ఆలయాల నిర్వాహక కమిటీలు, భక్తుల కమిటీల ఆధ్వర్యంలో స్థానిక వీధుల్లో గ్రామోత్సవాలు నిర్వహించారు. హాజరైన భక్తులకు దాతలు, నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు, అన్నదానాలు చేశారు. ఉదయం నుంచి శ్రీకృష్ణుని ఆలయాల వద్ద భక్తులు భారీగా చేరుకోవడంతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది.

ఆలయాల్లో విశేష పూజలు

కడప నగరం ద్వారకానగర్‌లోని శ్రీ మురళీకృష్ణాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చక బృందం ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవ నిర్వహించారు. 4.30 గంటలకు స్వామి వారికి తిరుమంజనం (విశేష అలంకార అభిషేకం), 7.30 గంటలకు మంగళ హారతి, సర్వదర్శనం, తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు ధ్యాన మందిరంలో గీతా పారాయణం గావించారు. సాయంత్రం 5 గంటలకు ఊంజల సేవ, శ్రీకృష్ణ కీర్తనామృతం జరిగాయి. 5.30 గంటలకు ఉట్టికొట్టే కార్యక్రమం ఉల్లాసభరితంగా కొనసాగింది. రాత్రి 7.30 గంటలకు ద్వారక నగర్ పురవీధుల్లో స్వామి వారి ఉత్సవ ఊరేగింపు, రాత్రి 9 గంటలకు ఏకాంత సేవ నిర్వహించారు. పండుగ సందర్భంగా చిన్నారుల శ్రీకృష్ణ, రుక్మిణి, సత్యభామ వేషధారణలు ఆకట్టుకున్నాయి. భగవాన్ శ్రీమురళీకృష్ణ ఆలయ కమిటీ, సుందర సత్సంగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఉదయం నుంచే వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉత్సవాల నేపథ్యంలో పోలీసులు ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న వేషధారణలు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని శ్రీ వివేకానంద మహిళా డిగ్రీ కళాశాల(అటానమస్)లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు కృష్ణుడు, గోపికలుగా వేషధారణలో వచ్చి అందరినీ అలరించారు. ఈ సందర్భంగా ఉట్టికొట్టే కార్యక్రమంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలను ప్రదర్శించి సందడి చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల కరస్పాండెంట్ డీఎస్‌ఆర్ మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ ఎన్‌సీ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణుని జీవితం మనకు కష్టానష్టాలను ఎలా అధిగమించాలో తెలియ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందితో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.



భక్తులకు ప్రసాద వినియోగం



రాధాకృష్ణుల వేషధారణలో విద్యార్థినులు

కడప అర్బన్ : భగత్‌సింగ్ నగర్‌లోని దిన్నెపాటి బసిరెడ్డి వికాస్ స్కూల్ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. వికాస్ స్కూల్ అధినేత బసిరెడ్డి, కో-డైరెక్టర్ శివకళ, ఉపాధ్యాయులు సబిహ, ప్రియాంక, హసీనా పాల్గొన్నారు.

వర్షం వస్తే.. ఆ రోడ్లు అంతే..!



రామాంజనేయపురంలో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు



సుబ్బిరెడ్డి కాలేజ్ పక్కన వీధిలో రోడ్డుపై నిలిచిన నీరు

కడప కార్పొరేషన్ : ఇటీవల కురుస్తున్న వర్షాలకు కడప నగరం తడిసి ముద్దవుతోంది. నగరంలోని మట్టి రోడ్లు వర్షపు నీటితో వంకలు, చెరువులను తలపిస్తున్నాయి. నగర శివార్లలోని రామాంజనేయపురం, వరదకాలనీ, జర్నలిస్టు కాలనీ, వికలాంగుల కాలనీ, సాగర్ కాలనీ, తిలక్ నగర్, శాంతి నగర్, రామక్రిష్ణ నగర్, బుడ్డాయపల్లె, బుడగజంగం కాలనీ, అల్లూరి సీతారామరాజు నగర్, రామరాజుపల్లె, గౌస్ నగర్, గంజికుంట కాలనీ తదితర ప్రాంతాల్లో మట్టి రోడ్లు బురదమయం అయ్యాయి. దీంతో అక్కడున్న ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ మిట్ట ఉందో తెలియక చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నగరపాలక అధికారులు శివారు కాలనీలపై దృష్టి పెట్టి అక్కడున్న సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

నగరంలో మోస్తరు వర్షం

కడప కార్పొరేషన్ : కడప నగరంలో శనివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మేఘావృతమై చిరుజల్లులు కురుస్తూ ఉన్న వాతావరణం.. సాయంత్రానికి భారీ వర్షంగా మారింది. వాన రాకతో నగరంలోని రహదారులన్నీ జలమయం అయ్యాయి. చిరు వ్యాపారులు, తోపుడుబండ్లు, ఫుట్‌పాత్ వ్యాపారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం వల్ల రహదారులపై పలు చోట్ల వర్షపునీరు నిలిచిపోయింది.



వర్షం కురుస్తున్న దృశ్యం

ఘనంగా హనుమంతుడి గ్రామోత్సవం

వీరపునాయునిపల్లె : నాలుగో శనివారం సందర్భంగా స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం వేకువజామున్నుంచే భక్తులు ఆలయనానికి చేరుకొని స్వామికి ఆకుపూజలు, అర్చనలు, అభిషేకాలు జరిపించారు. ఉదయం 9 గంటల నుంచి ఆలయ ప్రాంగనంలో నిర్వహించిన హోమ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గండికి కాలినడకన వెలుతున్న భక్తులకు సంగమేశ్వర విద్యా సంస్థల అధినేత, ఆలయ ధర్మకర్త ఒంటిగారి వెంకట సుబ్బానాయుడు బోజనం ఏర్పాటు చేశారు. కోలాట కార్యకర్మం అలరించింది.



గ్రామోత్సవంలో ఆంజనేయస్వామి

వాజపేయికి బీజేపీ నేతల నివాళి



వాజ్‌పేయి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజపేయి వర్ధంతి సందర్భంగా కడప నగరంలోని ఎన్జీఓ కాలనీలో గల వాజ్‌పేయ్ సర్కిల్ ఉన్న అటల్ బిహారీ వాజపేయి విగ్రహానికి బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు పుప్పాల శ్రీధ్‌రెడ్డి, నాయకులు కందుల మురళి మోహన్‌రెడ్డితోపాటు ఇతర నేతలు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ నాయుడు, గోసుల శ్రీనివాసులరెడ్డి, చాగలమర్రి ఓబులేసు, పవన్, సురేంద్ర,శివ నాయక్, లక్ష్మణ్ రావు, రమణ రెడ్డి, ప్రభు కుమార్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేవీ ఉద్యోగికి సీజీసీ మెడల్

కలసపాడు : మండలంలోని కొండపేట గ్రామానికి చెందిన పాలకొలను నారాయణరెడ్డి, వీరమ్మల కుమారుడు రమణారెడ్డి నేవీలో ఉద్యోగం చేస్తున్నారు. గత ఏడాది నవంబర్‌లో భారత నావీ సిబ్బంది సాహసోపేతంగా పాకిస్థాన్ సముద్ర జలాల్లో చిక్కుకున్న మన దేశ జాలర్లను రక్షించారు. రమణారెడ్డి సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా ఆయనకు సీజీసీ మెడల్‌ను బహుకరించారు.

మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి

పోరుమామిళ్ల : ఉద్యోగ ఉపాధ్యాయులకు 5 డీఏలు, మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.వి.రమణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధ్యంతర భృతి ప్రకటించకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదని, 30 శాతం ఐఆర్ ఇవ్వాలని ఆయన కోరారు. 2022 నుంచి ఈఎల్ బకాయిలు ఇంతవరకు జమకాలేదన్నారు.

23 నుంచి సీపీఐ రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 28వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఒంగోలు నగరంలో జరగనున్నాయని ఆ పార్టీ నగర కార్యదర్శి యస్.వెంకటశివ పేర్కొన్నారు. 23వ తేదీన జరిగే ర్యాలీ, బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. శనివారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ నగర జోన్ సమితుల ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ, ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు అయినప్పటికీ ప్రజల జీవన పరిస్థితుల్లో ముఖ్యంగా కష్టజీవులైన కార్మిక, రైతాంగ, ఉద్యోగ, ఉపాధ్యాయ, అసంఘటిత రంగాల వారిలో మెరుగైన మార్పులేమీ కనపడలేదన్నారు. ఈ పాలక ప్రభుత్వాలు కార్పొరేట్ వర్గాలను ప్రోత్సహిస్తూ లక్షలాది రూపాయలు వారికి రాయితీల రూపంలో అందిస్తూ, ప్రభుత్వ సంస్థలను కారు చౌకగా అమ్మేస్తున్నాయన్నారు. పోరాటాలతోనే పాలక ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలన్నారు. 23వ తేదీన ఒంగోలులో జరిగే ర్యాలీ, భారీ బహిరంగ సభకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ మాజీ సభ్యుడు డి.రాజా, జాతీయ కార్యదర్శి నారాయణ, తెలంగాణ శాసనసభ పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు తదితరులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి ఉద్దే మద్దిలేటి, నగర కార్యవర్గ సభ్యులు బ్రహ్మం, మల్లికార్జున, మునెయ్య, భాగ్యలక్ష్మి, యేసు రత్నం, జయరామయ్య, పక్కీరప్ప, నరసమ్మ, ప్రదీప్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమ చరిత్రను వక్రీకరించిన మోదీ



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత మహమ్మద్ అలీఖాన్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఎర్రకోటపై జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను ప్రశంసించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశద్రోహానికి పాల్పడ్డారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ ధ్వజమెత్తారు. స్వాతంత్ర్య ఉద్యమంతో సంబంధం లేని ఆర్‌ఎస్‌ఎస్ జపం చేస్తూ చరిత్రను వక్రీకరించడం దారుణమన్నారు. నగరంలోని తన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రభుత్వంలోని పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపే పోస్టర్‌లో జాతిపిత మహాత్మా గాంధీ, స్వాతంత్ర్య సమర యోధులు సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్‌తోపాటు ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన సావర్కర్‌కు అత్యున్నత స్థానం కల్పిస్తూ ఫొటో ప్రచురించడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ బ్రిటీష్ పాలకుల పక్షాన నిలబడి దేశద్రోహానికి పాల్పడినట్లు ఆరోపించారు. జాతీయ పతాకం, రాజ్యాంగాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన సంస్థగా ఆర్‌ఎస్‌ఎస్‌పై దేశద్రోహం ముద్ర ఉందన్నారు. అలాంటి ఆర్‌ఎస్‌ఎస్‌ను ఎర్రకోట ప్రసంగంలో నరేంద్ర మోదీ ప్రశంసిస్తూ దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసినట్లు అబద్ధాలు చెప్పడాన్ని తప్పు పట్టారు.

ప్రజాప్రతినిధి వైఖరి సరికాదు

కడప సెవెన్‌రోడ్స్ : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజాప్రతినిధులు సంయమనం పాటించకపోగా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడం సరికాదని రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బీపీ వేదనాయకం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమర వీరుల త్యాగాల వల్ల దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని జాతి యావత్తు జరుపుకొనే పండుగని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఈ వేడుకలను జరుపుకోవాల్సి ఉంటుందన్నారు. అలాంటి సందర్భంలో ప్రజాప్రతినిధి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడం తగదన్నారు.